## క్లుప్తంగా

### తిమ్మరాజుపేటలో శ్రీరామ నామస్మరణ



రామాలయం వద్ద విగ్రహాలతో గ్రామస్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేట శ్రీరామ నామస్మరణతో మార్మోగింది. ఇక్కడ నూతనంగా రామాలయం నిర్మాణం పూర్తయిన సందర్భంగా విగ్రహాలను వచ్చే నెల ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ సందర్భంగా రామ లక్ష్మణ, సీతాదేవి విగ్రహాలకు భద్రాచలంలో పూజలు చేసి శనివారం తిమ్మరాజుపేటకు తీసుకువచ్చారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి రామనామ స్మరణ గావించారు.

### పెయ్యదూడల ఉత్పత్తే లక్ష్యం



రైతులకు అవగాహన కల్పిస్తున్న పశు వైద్య అధికారులు

పాయకరావుపేట: మేలు జాతి పశు సంపద అభివృద్ధికే గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని పశు సంవర్ధక శాఖ ఏడీ శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా మండలంలోని కొత్తూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. పాడి రైతులు ఒక పశువుకు రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. మేలు జాతి పశువులు పుట్టించడం కోసం లింగ నిర్ధారిత వీర్య నాళికలను వినియోగించడం జరుగుతుందన్నారు.

### స్థలం ఆక్రమణపై విచారణ



స్థల ఆక్రమణపై విచారణ చేస్తున్న తహసీల్దారు తిరుమలబాబు

కోటవురట్ల: స్థల ఆక్రమణపై అందిన ఫిర్యాదుతో తహసీల్దారు తిరుమలబాబు శనివారం విచారణ చేపట్టారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆనుకున్న స్థలం ఆక్రమణపై విచారణ చేయాలని హెచ్ఎం ఎం.లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్కడ నిర్మించిన భవనానికి సంబంధించి అనుమతులు, డాక్యుమెంట్లు తహసీల్దారు కార్యాలయంలో సమర్పించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. పక్కనే ఖాళీ స్థలంలో వేసిన ఫెన్సింగ్, సిమెంట్ స్తంభాలను తొలగించాలని సిబ్బందికి ఆదేశాలిచ్చారు. ఆక్రమణకు గురైన స్థలానికి సంబంధించిన అంశం కోర్టులో ఉందని, అంతవరకు దాని జోలికి ఎవరూ పోరాదన్నారు. హెచ్ఎం ఎం.లక్ష్మి, ఉపాధ్యాయుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు.

### కోటవురట్ల స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ



కోటవురట్ల పోలీసు స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ శ్రీనివాసరావు

కోటవురట్ల: నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు స్థానిక పోలీసు స్టేషన్‌ను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. కేసుల పురోగతిని తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. క్రైమ్ కేసులన్నీ వెనువెంటనే పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. కేసులపై స్టేషన్‌కు వచ్చేవారి పట్ల స్నేహ పూర్వకంగా మెలగాలని, గ్రామాల్లో శాంతిభద్రతలు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని ఎస్ఐ రమేష్‌కు సూచించారు. గంజాయి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తామని, క్రైమ్‌రేట్ తగ్గేలా కృషి చేస్తానన్నారు.

### గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

కోటవురట్ల: గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉదయం 9 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరణ ఉంటుందని, అందరు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.



# అసంపూర్తిగా భవనాలు

- పూర్తికాని సచివాలయ భవనాలు
- ప్రజలకు మళ్లీ పాత కష్టాలు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



అరట్లకోటలో అసంపూర్తిగా రైతు భరోసా కేంద్రం

పాయకరావుపేట పట్టణంలో అసంపూర్తిగా గ్రామ సచివాలయ భవనం

పాయకరావుపేట పట్టణంలో అసంపూర్తిగా నిర్మించి ఉన్న వెల్‌నెస్ సెంటర్

పాయకరావుపేట: వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు సర్కారు కుట్రలు పన్నుతోంది. అందులో భాగంగానే పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలను అసంపూర్తిగా వదిలేసింది. దాంతో ప్రజలు ప్రభుత్వ సేవల కోసం తిప్పలు పడుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఈ పరిస్థితి తప్పడం లేదని పలువురు వాపోతున్నారు.

**పలు భవనాలు అసంపూర్తిగానే...**

నియోజకవర్గంలో ఆయా గ్రామాల్లో 92 సచివాలయాలు నిర్మాణానికి గాను 34 పూర్తయ్యాయి. మిగిలిన 58 సచివాలయ భవనాలు అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్నాయి. 81 రైతు భరోసా కేంద్రాలకు గాను 35 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 46 భవనాలు అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్నాయి. 79 ఆరోగ్య కేంద్రాలకు గాను 25 భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు పూర్తి చేయవలసిన కూటమి ప్రభుత్వం ఇంతవరకు వాటిపై దృష్టి సారించలేదు. ఇప్పటికైనా సరే ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా నిర్మించి ఉన్న భవనాలు పూర్తి చేసి, ప్రజలకు పాలనా సౌలభ్యం కల్పించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ డీఈ వై.హరిని సంప్రదించగా నియోజకవర్గంలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న భవనాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

**గతంలో ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు**

వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకురావాలని ప్రతి గ్రామంలోను పరిపాలనా భవనాలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. ఇందులో భాగంగా ప్రతీ గ్రామంలోను రైతులకు అన్ని విధాలుగా సహాయం కోసం రైతు భరోసా కేంద్రాలు, గ్రామస్తుల సౌలభ్యం కోసం గ్రామ సచివాలయాలు, స్థానికంగా వైద్యం అందుబాటులో ఉండడం కోసం ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాంతోనే పింఛన్ల నుంచి వైద్యం వరకూ ఇలా అన్ని సేవలు గ్రామాల్లోనే ఎటువంటి వ్యయప్రయాసలు లేకుండా ప్రజలు పొందేవారు. ఇప్పుడు 2019కు ముందు కష్టాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రతి పనికీ మండల, జిల్లా కేంద్రాలకు వెళ్లే పరిస్థితి కలుగుతోంది.

# వాడివేడిగా సర్వసభ్య సమావేశం



అధికారి వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ ఉమాదేవి



టీడీపీ, వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచుల వాగ్వాదం

కోటవురట్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడివేడిగా జరిగింది. ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. జెడ్పీటీసీ సిద్ధాబత్తుల ఉమాదేవి, వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు సమీక్ష చేశారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు శాఖలవారీ వివరణ కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసరావు మాట్లాడుతుండగా పలు గ్రామాల్లో నేటికీ పనులు పూర్తి కాలేదని, తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, ఎంపీటీసీ పెట్ల రాంబాబు ఆరోపించారు. చినబొడ్డేపల్లిలో చేతిబోరుకు మరమ్మతు చేయలేదని సర్పంచ్ పైల శివరామ్, కొడవటిపూడిలో కోదండరాంపురం గ్రామానికి వెళ్లే మంచినీటి మోటారు పనిచేయలేదని, మరమ్మతు కోసం సిబ్బంది స్పందించలేదని సర్పంచ్ కోసూరు అప్పారావు ఆరోపించారు. ఏపీవో నాగరాజు ఉపాధి కూలీలలో విభేదాలు సృష్టించి రాజకీయం చేయడం తగదని నీలిగుంట సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు ధ్వజమెత్తారు. అదే సమయంలో టీడీపీ మద్దతు సర్పంచ్ లింగన్నాయుడు అధికారులను కాపాడే ధోరణిలో వాగ్వాదానికి దిగారు. సర్వశిక్షా అభియాన్ నాడు–నేడు పనులను ఏఈ మూర్తి వివరిస్తుండగా మెటీరియల్‌కు సంబంధించి వెండర్స్‌ను ఎవరిని తీసుకుంటున్నారని ఎంపీటీసీ సభ్యుడు పుట్రేవు వెంకటసూర్యారావు ప్రశ్నించారు. దానికి ఏఈ సమాధానమిస్తూ టీడీపీ నాయకులే అన్నీ చూసుకుంటున్నారని తెలిపారు. దాంతో జెడ్పీటీసీ సభ్యురాలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కార వేదికలో ఓ ఉన్నత స్థాయి అధికారి నిర్భయంగా ఓ పార్టీకి కొమ్ముకాస్తూ మాట్లాడడం దారుణమన్నారు. టీడీపీ మద్దతు సర్పంచులు లేచి గత ప్రభుత్వంలో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా జరిగాయని, ఇప్పుడు దీనిపై అడిగే హక్కులేదంటూ మొండిగా వాదించారు. సమావేశం యావత్తు అధికారులకు టీడీపీ మద్దతు సర్పంచులు కొమ్ముకాస్తూ కాపాడుతూ రావడం విమర్శలకు తావిచ్చింది. వైస్ ఎంపీపీ–2 చక్కా సుజాత పాల్గొన్నారు.

### జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

అచ్యుతాపురం: మండలంలోని వెదురువాడలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కొంతసేపు బ్యాటింగ్ చేసి స్థానికుల్ని అలరించారు. ఈ పోటీల్లో యాభై జట్లు పాల్గొంటున్నాయి. మరిడిమాంబ జాతర పురస్కరించుకొని ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొయ్య మహాలక్ష్మి, శ్రీనివాస్ తెలిపారు. బుద్ధ రాజేశ్ వర్మ,శ్రీర శ్రీనివాస్,కొయ్య మాలక్ష్మినాయుడు, కిలాడి బాబాజీ తదితరులు పాల్గొన్నారు.

### గౌరీపరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక: వచ్చే నెల 1న మునగపాకలో నిర్వహించే గౌరీ పరమేశ్వరుల ఉత్సవానికి సంబంధించి పోస్టర్‌ను ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, పెద్దలు దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశురామ్, సూరిశెట్టి కన్నారావు, పొలిమేర కృష్ణ, ఆడారి సూర్యచంద్రరావు, సూరిశెట్టి అప్పలనాయుడు, ఆడారి రమణబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఓటు సామాన్యుడి వజ్రాయుధం

వాడవాడలా ఘనంగా ఓటరు దినోత్సవం



పాయకరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దారు, ఎంపీడీవో



నక్కపల్లిలో సీనియర్ సిటిజన్లను సన్మానిస్తున్న దృశ్యం



కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు



రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రతిజ్ఞ



మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు



చినదొడ్డిగల్లులో విద్యార్థులతో మావనహారం



యలమంచిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు



యలమంచిలిలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఈఆర్వో మనోరమ



కోటవురట్లలో ఓటు విలువను వివరిస్తూ మానవహారం



పి. ధర్మవరం పాఠశాలలో విద్యార్థుల మానవహారం

యలమంచిలి రూరల్: ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వజ్రాయుధమని నియోజకవర్గ ఈఆర్వో కే మనోరమ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయం, ప్రభుత్వ విద్యా సంస్థల్లో పలు కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పట్టణ ప్రధాన రహదారిపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు. స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఓటు హక్కు వజ్రాయుధంతో సమానమని ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. జంపపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఓటరు దినోత్సవ ప్రాముఖ్యతను హెచ్ఎం శాస్త్రి వివరించారు. తహసీల్దార్ వరహాలు, బొడ్డేడ సత్యనారాయణ పాల్గొన్నారు.

నక్కపల్లి: ఓటు సద్వినియోగంతోనే సామాన్యుడి మనుగడ ఉంటుందని తహసీల్దార్ రేగులపాటి నర్సింహమూర్తి తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఓటర్లతో మానవ హారం, ప్రతిజ్ఞ చేయించారు. సీనియర్ సిటిజన్లు దేవవరపు కొండలరావు, నున్న సుబ్రహ్మణ్యం, అడ్డూరి ఈశ్వరరావులను సన్మానించారు. చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో రవీంద్రనాథ్ ఠాగూర్ ఇంగ్లిషు క్లబ్ వ్యవస్థాపకుడు ఏడిద వెంకటరమణ మాస్టర్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో సీతారామరాజు, ఏరియా ఆస్పత్రి కమిటీ సభ్యుడు కొప్పిశెట్టి వెంకటేష్, డీటీ నారాయణరావు, ఆర్ఐ కన్నబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరు శ్రీను పాల్గొన్నారు.

కోటవురట్ల: జాతీయ ఓటరు దినోత్సవాన్ని మండలంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు విలువను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. తహసీల్దారు తిరుమలబాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన కూడలి వరకు ర్యాలీ చేసి మానవహారంగా ఏర్పడ్డారు. కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం షేక్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

పాయకరావుపేట: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో జయప్రకాష్ పాల్గొని ఓటు ప్రాముఖ్యతను వివరించారు. సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి (యలమంచిలి): రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఎంపీడీవో జయమాధురి ప్రతిజ్ఞ చేయించారు. 18 ఏళ్లు నిండిన వారు తప్పకుండా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ఓటుహక్కు వజ్రాయుధం అని తహసీల్దార్ జే రమేష్‌బాబు అన్నారు. ఎస్.రాయవరంలో యువకులకు ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్లను సత్కరించారు. పి. ధర్మవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



వెంకటాపురంలో పేదలకు దుప్పట్లు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే యువీ రమణమూర్తిరాజు శనివారం పర్యటించారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజును పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గవర్ల అనకాపల్లికి చెందిన సాధన సంస్థ అధ్యక్షుడు షేక్ ఇస్మాయిల్ భార్య అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందడంతో ఆయనను పరామర్శించారు. వెంకటాపురం మాజీ ఉప సర్పంచ్ బొమిరెడ్డిపల్లి సత్యవాణి ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు సత్యవాణి కుమారుడు శ్రీనివాసరావు, వెంకటాపురం ఉప సర్పంచ్ సాయివజ్రంలను రమణమూర్తిరాజు పరామర్శించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, మునగపాక, అచ్యుతాపురం మండలాల పార్టీ కన్వీనర్లు ఆడారి అచ్చియ్యనాయుడు, దేశంశెట్టి శంకరరావు, వెంకటాపురం సర్పంచ్ సుందరపు తాతాజీ, మహిళా విభాగం నేత శీరా రమణమ్మ, మునగపాక ఎంపీటీసీ బోడకుర్తి గణేష్ పాల్గొన్నారు.

# శానిటేషన్‌పై దృష్టి సారించాలి

డీఎల్‌పీవో మూర్తి



నక్కపల్లిలో అధికారులతో సమావేశమైన డీఎల్‌పీవో

నక్కపల్లి: మండలంలో అన్ని గ్రామాల్లోను శానిటేషన్‌పై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి పెట్టాలని నర్సీపట్నం డివిజనల్ పంచాయతీ అధికారి ఎస్.ఎస్.ఎస్. మూర్తి తెలిపారు. శనివారం ఆయన నక్కపల్లిలో ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. నక్కపల్లిలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోను శని, ఆదివారాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. రోజువారీ శానిటేషన్ పనులకు ఈ డ్రైవ్ అదనమన్నారు. మురుగు కాలువల్లో పూడిక తీత తొలగించడం, రోడ్లపై చెత్తను తొలగించాలని క్లోరినేషన్ చేయించాలని, బ్లీచింగ్, ఫినాయిల్ జల్లించాలన్నారు. తడి, పొడి చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా ఉన్నాయన్న ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోజూ గ్రామాల్లో స్వీపర్లు సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. లక్షలాది రూపాయలు పెట్టి నిర్మించిన ఈ కేంద్రాల్లో కార్యకలాపాలను ప్రారంభించాల్సిన బాధ్యత కార్యదర్శులదేనన్నారు. సచివాలయాల్లో పౌర సేవలను సైతం పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో సీతారామరాజు, కార్యదర్శి బీఏబీఎల్ మూర్తి, రాజశేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన అధికారులు



కోటవురట్లలో చిత్రాలతో విద్యార్థులు

పాయకరావుపేట: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పెంటకోట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.వి. లక్ష్మి, ఎంపీడీవో జయప్రకాష్‌రావు, మండల విద్యాశాఖ అధికారులు కేఎస్ గాంధీ, రమేష్‌బాబు, ఈవోపీఆర్డీ సిహెచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కోటవురట్ల: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. ఆర్ట్ ఎడ్యుకేషన్ టీచర్ ఎస్.ఈశ్వర్ ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీ నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. పీడీ గణేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గోనెసంచెలతో కప్పగంతులు, విద్యార్థినులకు పరుగుపందెం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎం.లక్ష్మి మాట్లాడుతూ గణతంత్ర వేడుకలు సందర్భంగా ఆదివారం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### గ్రామాల అభివృద్ధే ధ్యేయం




చెరువు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. నాగవరంలో ఏషియన్ పెయింట్స్ సహకారంతో రూ.15 లక్షలతో చేపట్టనున్న ఊరచెరువు పునరుద్ధరణ పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పుష్కలంగా నీటి సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నీటి వనరుల అభివృద్ధికి అందరి సహకారం తీసుకుంటున్నామన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తున్నామన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, మళ్ల కాలేశ్వరరావు, మళ్ల నరసింగరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: మండలంలోని దోసూరులో కుడి చెరువు పునరుద్ధరణ పథకాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఏషియన్ పెయింట్స్ సీఎస్ఆర్ సౌజన్యంతో రూ. 29.08 లక్షలతో అభివృద్ధి చేయనున్నారు. జనసేన, టీడీపీ నేతలు, ఏషియన్ పెయింట్స్, అంబుజా సిమెంట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పశు పోషణలో జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులకు మందులు అందజేస్తున్న పశువైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక: ప్రతీ రైతు తప్పనిసరిగా పశుపోషణలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ కోరారు. పాటిపల్లి శివారు గొల్లపేటలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు సబ్బి శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవాల కొనుగోలుకు ప్రభుత్వం రాయితీలు అందజేస్తుందన్నారు. పల్లా సన్యాసిరావు, ఆడారి భాస్కరరావు, పల్లా రమణ, పంచదార్ల పైడయ్య, రైతులు పాల్గొన్నారు.

**పశు ఆరోగ్య శిబిరాలతో మేలు**

కోటవురట్ల: మండలంలోని పి.కె.పల్లి, గొట్టివాడ గ్రామాల్లో శనివారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టరు పెట్ల నరేష్ పర్యవేక్షించారు. రాయితీపై అందిస్తున్న లింగ నిర్ధారణ వీర్యం, పశు కిసాన్ క్రెడిట్ కార్డులు, పశు గ్రాస క్షేత్రాలు గురించి అవగాహన కల్పించారు. రైతులకు మినరల్ మిక్చర్, కాల్షియం టానిక్‌లను ఉచితంగా అందించారు. ఈ శిబిరాలలో 82 పశువులకు గర్భకోశ చికిత్సలు, 220 మేకలు, గొర్రెలకు నట్టల నివారణ టీకాలు వేశారు. జాయింట్ డైరెక్టర్ డాక్టరు చెల్లయ్య, పశు వైద్యాధికారులు హరిప్రియ, ఆర్.ప్రతాప్‌కుమార్, సర్పంచులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: నునపర్తి గ్రామంలో శనివారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. నునపర్తి జేవీవో గంగాధర్, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి, గోపాలమిత్ర సూపర్ వైజర్ కె.సుబ్రహ్మణ్యం, ఎస్ సత్యనారాయణల ఆధ్వర్యంలో గొర్రెలకు నట్టల నివారణ మందులను పశువులకు వైద్య పరీక్షలు వేశారు.